కాలింగ్‌బెల్ కొట్టడానికి చెయ్యెత్తగానే--

తలుపు తెరచుకుంది.

ఎదురుగా మహతి.

“కమాన్ ..... వస్తున్నావా ..... ”

సూట్‌కేసుతో నిలబడ్డ మధుకర్ వేపు పరీక్షగా చూసింది. మధుకర్ రాడనుకుంది, రాలేడనుకుంది. రాఘవేంద్ర నాయుడు అందుకు ఒప్పుకోడనుకుంది.

“సీరియస్‌గానే నిర్ణయం తీసుకున్నావా”

అనుమానంగా అడిగింది.

“ఎస్ ..... డెడ్ సీరియస్ ..... ”

“ఓకె ..... ఒన్ మినిట్ ..... ” హాల్లోంచి పరుగులాంటి నడకతో మేడెక్కి, ఒక చిన్న సూట్‌కేసుతో కిందకు దిగింది.

అప్పుడు చూసాడు మధుకర్ .

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని మహతి తల్లిదండ్రుల్ని -వాళ్ళిద్దరి చూపులు మహతి, మధుకర్ మీదే వున్నాయి.

మహతి వాళ్ళిద్దరి దగ్గరకు వెళ్ళి మౌనంగా నిలబడింది.

కూతురు కళ్ళల్లోకి చూడ్డం తప్ప రాజేంద్ర ప్రసాద్ ఏం మాట్లాడలేదు.

మహతి , తల్లి చెంప మీద ముద్దుపెట్టుకుని--

“బెంగపడకు ..... నేను సిటీలోనే వుంటాను” అంది. ఆ తల్లి ఏదో అనబోయి, రాజేంద్ర ప్రసాద్ కళ్ళతో వారించడంతో ఆ ప్రయత్నం మానుకుంది. ఆపైన చర చరా నడుచుకుంటూ గుమ్మం దగ్గరకొచ్చింది.

ఇద్దరూ నడిచి గేటు వరకూ వచ్చాక, తలతిప్పి గుమ్మం వేపు చూసింది. అక్కడ రాజేంద్ర ప్రసాద్ నిలబడి వున్నాడు.

కళ్ళొత్తుకుంటూ తల్లి .....

వీధి దీపాల వెలుగులో వాళ్ళిద్దరి నీడలూ పొడవుగా వున్నాయి.

చౌరస్తా వచ్చేవరకూ వాళ్ళిద్దరూ ఏం మాట్లాడలేదు.

“ఇది మనిద్దరిమధ్యా చాలెంజ్ అనుకో. ఇంటలిజెంట్ గేమ్ అనుకో ..... దీని అల్టిమేట్ గోల్ ..... ఫైనాన్షియల్ డామినేషన్, ఒక్క సంవత్సరం కాలపరిమితిలో ఎవరెంత సంపాదించినా, మనిద్దరిలో ఒకరి కంటే ఇంకొకరు ఒక రూపాయి ఎక్కువ సంపాదిస్తే ఆ వ్యక్తి విన్నర్ కింద లెక్క-

ఒకటి: మనిద్దరి ఎకౌంట్లూ ఒక బేంక్‌లో తెరవాలి.

రెండు: నువ్వు సంపాదించే డబ్బు, నీ స్వశక్తితో సంపాదించినదై వుండాలి.

మూడు: ఎక్కడా దొంగతనం కాని, మోసంకానీ చెయ్యకూడదు- చట్టం వేరు- న్యాయం వేరు లాంటి కథలు చెప్పకూడదు.

నాలుగు: నేను ఆడపిల్లను కాబట్టి, నాకేం బలహీనతలు లేవు. నువ్వు మగవాడివి కాబట్టి బలహీనతలకు దూరంగా ఉండాలి. అంటే సిగరెట్ కాల్చకూడదు. డ్రింక్ ముట్టకూడదు. అమ్మాయిల జోలికి పోగూడదు.

ఐదు: నెలరోజుల కొకసారి కల్సుకుంటాం.

ఆరు:  ఈ 12 నెలల కాలంలో మన స్వంత ఇళ్ళకు ఎవ్వరూ వెళ్ళకూడదు.

ఇవీ కండిషన్‌లు-వీటికి నువ్వు ఒప్పుకుంటే, అదీ మనస్ఫూర్తిగా - ఈ క్షణంతో మన గేమ్ మొదలౌతుంది- లేకపోతే ముందే చెప్పేయ్ ..... ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోదాం ..... " కవ్వింపుగా అంది మహతి.

"నువ్వు విధించిన షరతులన్నింటికీ నేనొప్పుకుంటున్నాను. మన ఎకౌంట్లు ఏ బ్యాంక్‌లో తెరవాలో చెప్పు"

సీరియస్‌గా అడిగాడు మధుకర్ .

"ఏం ..... మీ డాడీ దగ్గర్నించి ముందుగానే డబ్బు తెచ్చావా ..... " జోక్ వేసింది మహతి.

" జోకులొయ్యొద్దు ..... నీకు తెలుసోలేదో ..... ఒక్క పైసాకూడా నేనింట్లోంచి తీసుకురాలేదు ..... కావలిస్తే చూసుకో ..... " సూట్‌కేస్ తెరవబోయాడు.

"వద్దులే ..... నీమీద నాకా నమ్మకం వుంది. ఇంకో విషయం మర్చిపోయాను. ఈ ఏడాదికాలంలో మనం సంపాదించిన ప్రతి పైసా గురించి డిటైల్స్ ..... డైరీలో రాయాలి ..... బ్యాంక్ ఎకౌంట్లు మెహదీపట్నం స్టేట్ బ్యాంక్‌లో ఓపెన్ చేద్దాం."

"ఇంతేనా ..... ఇంకేమన్నా వున్నాయా ..... " అసహనంగా అడిగాడు మధుకర్ .

"ఇంకేం లేవు ..... " నవ్వుతూ అంది మహతి.

"ఒక డౌటు ..... అడగనా ..... "

"అడుగు ..... "

"ఎవరి దగ్గరైనా అవసరంవస్తే అప్పు తీసుకోవచ్చుగదా ..... "

"తీసుకోవచ్చు. తీర్చాలికూడా. కానీ ఆ విషయం డైరీలో తప్పనిసరిగా రాయాలి" చెప్పింది మహతి.

"నువ్వింట్లోంచి ఏమైనా డబ్బు తెచ్చావా ..... "

"తెచ్చాను ..... అది మా డాడీ డబ్బుకాదు ..... నాది ..... నా క్లాస్ బుక్సన్నీ సెకండ్ హేండ్ షాపులో అమ్మేశాను. వెయ్యిరూపాయలొచ్చాయి."

"అయితే ..... అందులో నాకో అయిదువందలు అప్పుగా ఇవ్వగలవా?"

నిన్నటివరకూ లక్షలు నీళ్ళలా ఖర్చుపెట్టిన మధుకర్ - ఇవ్వడం తప్ప, ఎవర్నీ అడగని మధుకర్ - జాలేసింది మహతికి. సూట్ కేసుని తెరచి, అందులోంచి అయిదు వందల్ని తీసి,

"నువ్వు డైరీలో రాయాల్సిన మొట్టమొదటి పాయింట్ ఇదే. "

మధుకర్ చేతిలో పెడుతూ అంది.

చీకటి చిక్కగా వుంది.

వాళ్ళిద్దరూ ఆ నిశీధిలో అస్థిత్వపు ప్రశ్నలుగా ఉన్నారు.

"ఈ గేమ్‌లో నేను గెలిస్తే ..... నువ్వు నాకేమిస్తావో ..... చెప్పు ..... " ఒకబ్బాయి, ఒకమ్మాయిని అలాంటి ప్రశ్న ఏ సమయంలో వేస్తాడో మహతికి తెలుసు.

ఆ అమ్మాయిని ఆ అబ్బాయి ప్రేమిస్తున్నపుడే .....

"సస్పెన్స్ - నువ్వూహించింది మాత్రం ఇస్తాను ..... " అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అంది మహతి.

"ఓ. కే. ..... లెటజ్ డిస్‌పర్స్ ..... " మధుకర్ అన్నాడు.

"విష్ యూ ఆల్ ది బెస్ట్ ..... " చెప్పింది మహతి.

ఆ చౌరస్తాలో రెండు దార్లున్నాయి.

ఒకటి శ్రీనగర్ కాలనీకి వెళ్ళేది. రెండు పంజాగుట్ట జంక్షన్‌కి వెళ్ళేది.

"గుడ్‌నైట్ ..... " చెప్పి మధుకర్ ముందుకి నడిచాడు.

అటు మహతి - ఇటు మధుకర్ .

పది అడుగులు నడిచి మహతి తలతిప్పి చూసింది. మధుకర్ తలొంచుకొని సూట్ కేసు పట్టుకుని సీరియస్‌గా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

" మధుకర్ ..... " గట్టిగా పిలిచింది.

నిశ్శబ్ద వాతావరణంలో విన్పించిన ఆ పిలుపుకి ఆగి తలతిప్పి చూసాడు మధుకర్ .

గబగబా పరుగెత్తి మధుకర్ దగ్గర కెళ్ళింది మహతి.

ఏం అన్నట్టుగా మధుకర్ ఆమె కళ్ళవేపు చూసాడు.

ఆమె గుండెల్లోని ఉచ్ఛ్వాస, నిశ్వాసల వేగం అతనికి విన్పిస్తోంది.

తటాలున ముందుకు వచ్చి- అతని పెదవుల్ని ముద్దు పెట్టుకుంది.

ఆ నాలుగు పెదవులూ కల్సుకున్న సమయం రెండే రెండు సెకండ్లు.

కనుమూసి తెరిచే సమయంలోనే - మహతి వెళ్ళిపోయింది. మధుకర్ ఏం జరిగిందో తెల్సుకోడానికి, తేరుకోడానికి రెండు నిమిషాలు పట్టింది.

మెత్తటి, వెచ్చటి, మహతి ముద్దు .....

సడన్‌గా అతనికి సిటిజన్ క్లబ్‌లోని సంఘటన గుర్తుకొచ్చింది.

ఎవరో చాచి దవడమీద కొట్టినట్టనిపించింది అతనికి.

స్త్రీ తను ప్రేమించిన పురుషుడికి తన అనురాగాన్ని వ్యక్తం చెయ్యడానికి ముద్దు ఇస్తుంది. అదీ ఏకాంతంలోనే- అంతే తప్ప బహిరంగ స్థలంలో కాదు- ప్రేమ పబ్లిసిటీ కోరుకోదు- ఆ రోజు తనెంత మూర్ఖంగా ప్రవర్తించాడు.

ఛ .....

తన రాక్షసత్వానికి మహతి ఇచ్చిన జవాబు ముద్దు .....

మధుకర్ నరనరాల్లో ఏదో ఉద్వేగ్నత

గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోతున్న మహతినే చూస్తూ నిలబడ్డాడు. మహతి పూర్తిగా కనుమరుగైపోయింది.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి-

శ్రీనగర్ కాలనీవేపు నడవడం మొదలు పెట్టాడు మధుకర్ .

**********

- సడన్‌గా సూట్‌కేసుతో తన ముందు ప్రత్యక్షమైన మధుకర్‌ని చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి.

"ఒరేయ్ ..... నువ్వు ..... మధుకర్ ..... వేనా ఇదేంటిరా ..... సూట్‌కేసుతో ..... " ప్రపంచంలో ఎనిమిదో వింతగా వుంది మధుకర్ రాక.

"ఏం ..... రాగూడదా ..... " పెదవుల మీద పాలిపోయిన నవ్వుతో రూంలోకి ప్రవేశించాడు మధుకర్.

మధుకర్‌ని చూడగానే అనుమానం వచ్చింది.

సమ్‌థింగ్ రాంగ్ విత్ హిమ్ ..... ఏదో జరిగింది. లేకపోతే మధుకర్ ఏమిటి ..... హాస్టల్‌కి రావడమేమిటి ..... అందునా సూట్‌కేస్.

“నేనో రెండ్రోజులు నీ రూంలో వుంటాను. నీకేం అభ్యంతరం లేదు కదా ..... ” అలా అడుగుతున్న మధుకర్ వేపు విస్మయంగా చూసాడు మూర్తి.

“నువ్వొక్కడివే ..... ఈ రూంలో వుంటానన్నా నేను బయటికెళ్ళిపోతాను ..... ”

చాలాసేపు మౌనంగా అలాగే కూర్చున్నాడు మధుకర్ .

మధ్యాహ్నం ఎప్పుడో తిన్న తిండి- కడుపు నకనకలాడుతోంది. కానీ భోజనం చెయ్యాలని అన్పించడం లేదు.

తను డిన్నర్‌కి వెళ్తూ పిలిచాడు మూర్తి.

“వద్దురా నాకు ఆకలిగా లేదు ..... నువ్వెళ్ళు ..... నాకు నిద్రపోవాలని వుంది.”

“ఓ. కే . నీ ఇష్టం ..... ” భుజాలెగరేస్తూ వెళ్ళిపోయాడు మూర్తి.

చిన్న ఐరన్ కాట్ - దానిమీద పల్చటి బెడ్‌షీట్ - మరకల్తో అదేదో వింత పురుగులా వున్న పిల్లో.

దానిమీద మీద అలా బడలికతో పడిపోయాడు మధుకర్ .

పది నిమిషాల్లో అతని గాఢంగా నిద్ర పట్టేసింది.

*   *   *   *

తన గదిలోకి ప్రవేశిస్తున్న మహతిని, ఆమె చేతిలోని సూట్‌కేసునూ ఆశ్చర్యంగా చూసింది డాక్టర్ హేమలత.

“మహీ ..... నువ్వా ..... ” వాడిపోయిన ఆమె ముఖంవేపు చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది హేమలత.

“నీ డ్యూటీ అయిపోతే, నేను కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి” కుర్చీలో కూర్చుంటూ అంది మహతి.

"నౌ అయామ్ ఫ్రీ ..... చెప్పు ..... ఏమిటి కథ ..... " స్టెతస్కోపును పక్కనపెడుతూ అంది.

"రెండ్రోజులు నువ్వు నాకు షెల్టర్ ఇవ్వాలి. ఇవ్వగలవా ..... " అలా అడుగుతున్న మహతి భావాల్ని పసికట్టడానికి ప్రయత్నిస్తోంది డాక్టార్ హేమలత .

"వాట్ హేపెండ్ మహతి ..... ఏం జరిగింది."

ఏదో జరగకపోతే, ఎప్పుడూ తుళ్ళుతూ, అపారమైన విశ్వాసానికి అధినాయికలా కన్పించే మహతి ఇలా బేలగా వుండదు.

"ఏం నాతో చెప్పడానికేం ..... చెప్పు ..... దాచుకోకు ..... " అలా రెట్టించి అడుగుతున్న హేమలత ముఖం వేపు ఒకసారి చూసి-

"నా కాళ్ళమీద నేను బ్రతకడానికి, ఇంట్లోంచి బయటి కొచ్చేశాను. పేరెంట్స్‌తో గొడవ పడలేదు ..... కానీ ..... " జరిగినదంతా చెప్పింది హేమలతతో మహతి.

"ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం ..... బాగానే వుంది. నువ్వు కోరి కష్టాలెందుకు కొని తెచ్చుకుంటున్నావో నాకర్థం కావడంలేదు. పైగా గర్భం రావచ్చేమో, చెప్పలేం...."హెచ్చరిస్తున్నట్టుగా అంది హేమలత .

"నువ్వు నన్ను టెస్ట్ చెయ్యక పూర్వమే నేను గర్భవతిని అవుతానని నాకు తెలుసు హేమ ..... ఐ నో ..... ఏ పిరీడ్‌లో కలిస్తే అవుతానో నాకు బాగా తెల్సు.

ఒకమ్మాయి ..... తనతో సరి సమానంగా ప్రవర్తించడాన్ని ఏ పురుషుడూ ఒప్పుకోడు. తనెదురుగా ఛాలెంజ్‌గా నిలబడే అమ్మాయికంటే, తను అన్ని విషయాల్లోనూ బలవంతుడినని నిరూపించుకోడానికి మగవాడెప్పుడూ ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో విఫలమైనప్పుడు, దారుణమైన పద్ధతుల ద్వారా ఆడదాన్ని వశం చేసుకోడానికి ప్రయత్నిస్తాడు. ఏ మగవాడిలోనైనా ఇదే స్వభావం వుంటుంది. దానికి అనువైనపరిస్థితులున్నపుడే ఆ స్వభావాలు బయటపడతాయి. ఆ

అనువైన పరిస్థితుల్ని నేనే మధుకర్‌కి కల్పించాను. మా అమ్మా నాన్న బొంబాయి వెళ్ళేలా పరోక్షంగా ప్రయత్నం చేసింది నేనే .....

మధుకర్‌ని అవకాశం దొరికినప్పుడల్లా వెర్రెక్కించాను. కిర్రెక్కించాను. పిచ్చివాడ్ని చేసాను. లక్షలుక్షలు అతనికి నష్టంవచ్చేలా చేసాను. ముద్దు ఇస్తానన్న పేరుతో వేలమంది మధ్య అవమానించాను. అతనేం బుద్ధుడు కాదు గదా ..... అవమానాన్ని కూడా గౌరవంగా స్వీకరిండనికి - ఎలా రియాక్టు అవుతాడో నాకు తెలుసు.

ఆడపిల్లను హింసించడానికి మగవాడు ప్రధానంగా ఎందుకునే మార్గం ఒకటే, అదే లైంగిక అత్యాచారం --

మధుకర్ విషయంలో నా అంచనా కరెక్టు.

నేను చేసినదానికి అతను నా మీద ప్రతీకారం తీర్చుకోవడం ఖాయం. ఆ ప్రతీకారాన్ని అతనెలా తీర్చుకుంటాడు? అందుకు ఒకటే మార్గం.

అది--

"రేప్"

నేను దాన్ని ప్రతి ఘటించగలను-- ఎదురుదెబ్బ తీయగలను. గానీ నేను అవ్వేవీ ఎందుకు చెయ్యలేదో తెల్సా -- నేనతన్ని ప్రేమిస్తున్నాను కాబట్టి ..... నేనతన్ని విశ్వసిస్తున్నాను కాబట్టి, నిన్ను కన్‌సల్ట్ చేశాను. పరిస్థితులన్నిటినీ నా కనువుగామలచుకున్నాను ..... నేను కోరుకున్నది గర్భవతిని కావడం ..... నేననుకున్న లక్షాన్ని చేరుకోడానికి నాకు మరో ఆయుధం దొరికింది" మహతి మాటలకు హేమలత షాక్ తింది.

"ఇంట్లోంచి వంటరిగా వచ్చిన ఈ పరిస్థితుల్లో ఈ మానసిక వత్తిడి, దానికి తోడు శారీరక వత్తిడిని నువ్వు భరించగలవా ..... ? అసలు అతన్ని ఈ పైశాచిక చర్యకు నువ్వెందుకు ప్రేరేపించావో , ఆ గర్భాన్ని నువ్వెందుకు కన్‌సీవ్ చెయ్యాలను

కుంటున్నావో నాకేం అర్థం కావడం లేదు ..... ” అంది హేమలత షాక్ నుంచి క్రమంగా తేరుకుంటూ.

“అన్నీ నువ్వే చూస్తావ్‌గా ..... బైదిబై నాకో చిన్న హెల్ప్ చెయ్యగలవా. ఓ రెండ్రోజులు నీ దగ్గర నేనుంటాను. షెల్టర్ ఇస్తావా”.

“అదేంమాట ..... రెండ్రోజులు కాకపోతే, ఈ ఏడాదంతా మా ఇంట్లోనే వుండు.”

“నీ ఇంట్లో కాదు ..... నీ ఇంట్లో నేనుంటే రవికిరణ్ అంకుల్ నన్ను ఆత్మీయురాలిలా చూస్తారు. అది నాకిష్టంలేదు - నేను నీ ఫ్రెండ్‌గా ఈ నర్సింగ్‌హోంలోనే రెండ్రోజులుంటాను. ఏదో ఉద్యోగం సంపాదించగానే బయటికెళ్ళిపోతాను.

నువ్వు మరో ప్రామిస్ చేయాలి -- నేను కావాలనే మధుకర్‌ని రెచ్చగొట్టి-- నన్ను రేప్ చేసేలా పురికొల్పానని -- రేప్ జరిగిందని రవికిరణ్ అంకుల్‌కి ఎట్టి పరిస్థితుల్లోను చెప్పకూడదు. ఒక లక్ష్యం కోసమే ఇదంతా చేస్తున్నానని నువ్వర్థం చేసుకోవాలి.”